క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న మిడ్డే మీల్స్‌ను సోమవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, నియోజకవర్గ సంయోజక్ దాకే కృష్ణారావు ఆధ్వర్యంలో నాయకులు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం విద్యార్థులకు సక్రమంగా అందించాలని, బలహీనంగా ఉన్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని పాఠశాల హెచ్‌ఎం గంగాభవానీకి సూచించారు. కేంద్ర ప్రభుత్వ రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ పథకం అమలుపై హెచ్‌ఎంతో చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు తమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల సర్వే

కిర్లంపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో ఓటర్ల సర్వే చురుగ్గా సాగుతోంది. కచ్చితమైన ఓటరు జాబితా తయారీనే లక్ష్యంగా ఈ నెల 21న ఓటరు సర్వేను ప్రారంభించారు. మండలంలోని చిల్లంగి, జగపతి నగరం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను సోమవారం డిప్యూటీ తహసీల్దార్ మడక శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఓటరు జాబితా తయారీలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి

తుని: ఎస్సీ వర్గీకరణ కోసం వచ్చే నెలలో నిర్వహించనున్న చలో హైదరాబాద్ విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ కోరారు. సోమవారం ఇసకలపేటలో ఉత్తరాంధ్రా, కోస్తా జిల్లాల ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి పెద్ద సంఖ్యలో నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేష్ మాదిగ మాట్లాడుతూ వచ్చే నెలలో నిర్వహించే మహాసభకు మాదిగలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు డాక్టర్ సుబ్బారావు మాదిగ, కాకాడ నూకరాజు, ముప్పిడి శ్యామ్‌కుమార్, ఆరుగుల సత్తిబాబు, ఆరుగుల ప్రవీణ్‌కుమార్, మురళీ పాల్గొన్నారు.

పొత్తులపై సరైన సమయంలో నిర్ణయం

తుని రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడ్డాయని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. తుని మండలం తేటగుంటలోని తన గేస్ట్ హౌస్‌లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యనమల దివ్య, ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడితో కలసి సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ ప్రభుత్వ కాలం ముగిసే సరికి రాష్ట్రంలో అప్పులు రూ.11 లక్షల కోట్లకు చేరుతుందన్నారు. కంబోడియా దేశంలో మాదిరిగా రాష్ట్రంలో ప్రతిపక్షాలు లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మీడియా, ప్రతిపక్షాలపై ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోందన్నారు. పొత్తులపై సరైన సమయంలో టీడీపీ అధిష్టానం సరైన నిర్ణయం తీసుకుంటుందన్నారు. చంద్రబాబుపై రాష్ట్ర ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు.

ఆర్వో ప్లాంట్‌కు భూమిపూజ

తొండంగి: మండలంలోని దానవాయిపేటలో ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సోమవారం జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత భూమి పూజ చేశారు. దివీస్ ల్యాబోరేటరీస్ ఆర్థిక సాయం రూ.14.83 లక్షలతో ఈ ఆర్వోప్లాంట్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ పద్మలత మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు దివీస్ కంపెనీ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. దివీస్ ల్యాబోరేటరీస్ సీనియర్ మేనేజర్ ఆర్.సుధాకర్, వైఎస్సార్ సీపీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనంద హరి, పార్టీ నాయకులు మడదా హేమంత్, కంపెనీ ప్రతినిధులు బి.వాసుబాబు పాల్గొన్నారు.

వరివడిగా నాట్లు

- మెట్టలో ఊపందుకున్న ఖరీఫ్ సాగు పనులు
- వ్యవసాయబోర్ల పరిధిలో చురుగ్గా వరినాట్లు
- నియోజకవర్గంలో 26 వేల ఎకరాల్లో సాగు


బెండపూడిలో వరినారు తీస్తున్న కూలీలు

తొండంగి: మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో ఖరీఫ్ వరి సాగు పనులు ఊపందుకున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు సాగు పనులను ముమ్మరం చేశారు. పంపా, పీబీసీ ఆయకట్టు పరిధిలో రైతులు ఇప్పటికే నారుమడులు సిద్ధం చేశారు. వ్యవసాయ బోర్లు పరిధిలో రైతులు నాట్లు వేస్తున్నారు. ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ఇప్పటికే ఆర్బీకేల్లో సిద్ధం చేసింది. కాలం సాగుకు అనుకూలంగా ఉండటంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

నియోజకవర్గంలో ఇలా..

తుని నియోజకవర్గంలోని కోటనందూరు మండలంలో 650 వ్యవసాయ బోర్లు ఉండగా 2500 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు. తొండంగి మండలంలో సుమారు 400 బోర్లు ఉండగా దాదాపుగా 800 ఎకరాలు, తుని మండలంలోని 480 బోర్లు ఉండగా 720 ఎకరాల్లోనూ మొత్తంగా నాలుగు వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతోంది. తొండంగి మండలంలోని పంపా ఆయకట్టు పరిధిలో 10 వేల ఎకరాలు, పీబీసీ ఆయకట్టులో మరో 2500 ఎకరాలు, కోటనందూరు తాండవ ఆయకట్టులో 8000 ఎకరాలు, తుని మండలంలోని పంపా, పుష్కర, తాండవ శివారు ఆయకట్టులలో మరో ఆరు వేల ఎకరాలు కలిపి మొత్తంగా దాదాపుగా 26 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరిసాగు జరుగుతోంది. మండలంలోని మెట్ట, పల్లపు ప్రాంతాల్లో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తుండటంతో రైతులు ముందుగానే నారుమడులు వేశారు. వ్యవసాయ బోర్లు ఎక్కువగా ఉన్న బెండపూడి, రావికంపాడు, ఎ.కొత్తపల్లి ప్రాంతాల్లో వరినాట్లు జోరుగా వేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో చిన్నాయపాలెం, కోదాడ, కొమ్మనాపల్లి, సీతారాంపురం తదితర ప్రాంతాల్లో నాట్లు పడనున్నాయి.

పంపా, పీబీసీ ఆయకట్టు పరిధిలో..

పంపా ఆయకట్టుకు ఈ నెల 15న రిజర్వాయర్ నుంచి రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా నీటిని విడుదల చేశారు. దీంతో ఆయకట్టు రైతులు నారుమడులను సిద్ధం చేసుకున్నారు. ఆగస్టు మొదటి వారానికి మండలంలోని అన్ని ప్రాంతాల్లో వరినాట్లు ప్రారంభమవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పంపా, పీబీసీలో నీటినిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. అన్ని ఆర్బీకేల్లోనూ ఇప్పటికే ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, తెగుళ్ల నివారణకు పురుగుల మందులు అందబాటులో ఉంచినట్టు మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.నరసింహం తెలిపారు.

ఎరువులు సిద్ధం



మండలంలోని ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులు ఆర్బీకేల్లో సిద్ధంగా ఉన్నాయి. డీఏపీ 23 మెట్రిక్ టన్నులు, యూరియా 115 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 5.5 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకే 35 మెట్రిక్ టన్నులు ఆర్బీకేల్లో సిద్ధం చేశాం. ఎరువులు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సిబ్బందిని సంప్రదించాలి.

– ఎస్.నరసింహం, మండల వ్యవసాయశాఖ అధికారి, తొండంగి

పుష్కర ఆయకట్టుకు నీరు విడుదల


పుష్కర కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలు

తుని రూరల్: ఖరీఫ్ సీజన్‌కు గాను పుష్కర ఆయకట్టుకు సోమవారం సాగునీటిని విడుదల చేశారు. తుని మండలం తేటగుంట శివారు గవరపేట వద్ద మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పోల్నాటి ప్రసాద్‌తో కలసి జేఈ బి.రేణుక చాందినీ పుష్కర కాలువ గేటును ఎత్తి దిగువకు నీరు విడదల చేశారు. తుని మండలంలో గవరపేట, టి.వెంకటాపురం, హంసవరం, హెచ్.కొత్తూరు, వల్లూరు, ఎ.అగ్రహారం, చామవరం, ఎస్.అన్నవరం, తొండంగి మండలం పైడికొండ, అనూరు, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పాల్తేరు, ఈదటం, తదితర గ్రామాల పరిధిలో చెరువులకు గోదావరి జలాలను మళ్లించడం ద్వారా 10 వేల ఎకరాలకు సాగునీరు చేరనుంది. రోజుకు 1.5 క్యూసెక్కుల నీరు విడుదలవుతుందని, దీన్ని కొద్ది రోజులు తర్వాత రెండు క్యూసెక్కులకు పెంచుతామని జేఈ వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- పెద్దనాపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం


పెద్దనాపల్లిలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని పెద్దనాపల్లిలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పథకాల అమలులో చేతివాటానికి ఆస్కారం లేకుండా నేరుగా ప్రతిలబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లో నగదు వేస్తున్నారన్నారు. గతంలో పింఛన్ కోసం లబ్ధిదారులు రోజుల తరబడి నిరీక్షించేవారని, ఇప్పుడు ప్రతినెలా ఒకటో తేదీ తెలవారుజామునే వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బుద్దా సూర్యప్రకాశ్, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, నీరుకొండ సత్యనారాయణ, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి, సామంతుల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

జగ్గంపేట: పనుల నుంచి తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ అధ్యక్షులు ఎం.ఏసు డిమాండ్ చేశారు. స్థానిక స్టాలిన్ భవనంలో సోమవారం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేటలోని వేణుగోపాల టైల్స్ ఆవరణలో ఉన్న గోనే సంచుల తయారీ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు ఎటువంటి నోటీస్ ఇవ్వకుండా విధుల తొలగించడం చట్టపరంగా నేరమన్నారు. ఒడిశా నుంచి వచ్చిన కార్మికులతో పనిచేయించడం సరైన పద్ధతి కాదన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ డివిజన్ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

తుని: డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ అధికారులు సూచించారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక 12వ వార్డులో ప్రజలకు డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. టైర్లు, కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బిందు సేద్యంపై రైతులకు అవగాహన కల్పించాలి


శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వరప్రసాద్

తొండంగి: బిందు సేద్యం, తుంపర సేద్యంపై గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మరింత అవగాహన కల్పించాలని ఉద్యానవనశాఖ జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జి.వరప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆర్బీకే సిబ్బందికి తుంపర, బిందు సేద్యం రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి, పామాయిల్ ఇతర ఉద్యాన తోటలకు తుంపర, బిందు సేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రైతుకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను రాయితీపై అందిస్తోందన్నారు. ఐదెకరాల లోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీపై, ఐదెకరాలు పైబడి ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందజేస్తున్నట్టు తెలిపారు. రైతుల వాటాగా 5 శాతం చెల్లించాలన్నారు. తుంపర సేద్యం చేసే రైతులకు 50 శాతం రాయితీపై స్ప్రింకర్లు, పైపులు వంటి సామగ్రి అందజేస్తున్నట్టు తెలిపారు. వీటిపై రైతలకు అవగాహన కల్పించి ఆసక్తి ఉన్న రైతుల వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.నరసింహం, ఏఈవో కొప్పన దైవప్రసాద్, గ్రామ సచివాలయ అగ్రికల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గోకవరం: స్థానిక ముస్లిం కాలనీలోని ఎంపీయూపీ ఊర్దూ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం సెమిస్టర్–2 పుస్తకాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తోలేటి రాంప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


తిరుమాలిలో డంపింగ్ యార్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని తిరుమాలిలో డంపింగ్ యార్డు, డ్రైన్లను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టిందన్నారు. గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు పసల నాగేశ్వరరావు, సర్పంచ్ సూతి ప్రసాద్, నీరుకొండ సత్యనారాయణ, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్ధసారథి, కట్టా పండు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మెప్మా మార్కెట్

ఏలేశ్వరం: మహిళలు తాము స్వయంగా తయారు చేసుకున్న వస్తువులతో పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన మెప్మా మార్కెట్ ఆకట్టుకుంది. పట్టణంలోని జగనన్న సురక్ష శిబిరం వద్ద మెప్మా ఆధ్వర్యంలో మహిళలు పలు రకాల వస్తువులతో దుకాణాలు ఏర్పాటు చేశారు. మెప్మా టీఎంసీ సాయికుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన మార్కెట్‌ను ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ప్రారంభించారు. మహిళలు స్వయంగా వస్తువులను తయారు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.

ప్రజల వద్దకే పాలన

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గొల్లలగుంటలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభం


సచివాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చారని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. మండలంలోని గొల్లలగుంటలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, 21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను ఆర్బీకేల్లో అందిస్తున్నారన్నారు. ప్రజలు తమ అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా గ్రామ సచివాలయాల్లోనే అన్ని రకాల సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం గ్రామంలోని నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జేసీఎస్ మండల కన్వీనర్, ఉప సర్పంచ్ బండారు రాజా తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు మోక్షం

సాక్షి ఇంపాక్ట్


తుని-నర్సీపట్నం రోడ్డులో మురుగును తొలగిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి పోలీసుస్టేషన్ వరకూ నెలకొన్న మురుగునీటి సమస్యకు మోక్షం లభించింది. సోమవారం ‘సాక్షి’లో ‘మురుగు సమస్యకు మోక్షమెప్పుడో?’ శీర్షికతో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ పర్యవేక్షణలో అధికారులు తుని–నర్సీపట్నం రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగును పొక్లెయిన్‌తో తొలగించారు. రోడ్డును శుభ్రం చేసి బ్లీచింగ్, దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ రోడ్డును ఆనుకొని ఉన్న నివాసాలు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నుంచి వాడకం నీటిని రోడ్డుపై విడిచిపెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాధుల సీజన్ కావడంతో పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని అరుణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ గుమస్తా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హోరు వాన


గోకవరం శివారులో రంపయర్రంపాలెం రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

గోకవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. భారీ వర్షాలకు చెరువులు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. గోకవరం శివారున రంపయర్రంపాలెం వెళ్లే మార్గంలో చెరువు పొంగడంతో రహదారిపై నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఏజెన్సీలో కురిసిన భారీ వర్షాలకు ఊరకాలువలోకి వరద నీరు చేరడంతో ఉధృతంగా ప్రవహించింది. సంజీవయ్యనగర్‌లోని సప్టాపై ఊరకాలువ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి.

గండేపల్లి: అల్పపీడనం ప్రభావంతో సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు, పంట బోదెలు, కాలువల వెంబడి నీరు ఏరులై పారుతోంది.

పార్టీలకు అతీతంగా పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గ్రామాల్లో ఉత్సాహంగా జగనన్న సురక్ష కార్యక్రమం


శృంగరాయునిపాలెంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


ఏలేశ్వరంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

కిర్లంపూడి: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని శృంగరాయునిపాలెంలో సోమవారం బొజ్జపు శ్రీను అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ తోట రవి, సర్పంచ్ పట్టు చంటిబాబు, తోట గాంధీ, చదలవాడ బాబీ, జనపరెడ్డి బాబుతో కలిసి గ్రామంలో అర్హులైన 135 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటికే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గరగ గోవిందు, అల్లు విజయకుమార్, తోట అయ్యన్న, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, భూపాలపట్నం ప్రసాద్, తహసీల్దార్ కేవీ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


జి.కొత్తపల్లిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ పర్వత రాజబాబు


లచ్చిరెడ్డిపాలెంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న నాయకులు

లబ్ధిదారుల ఇంటికే ప్రభుత్వ పథకాలు

ఏలేశ్వరం: గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో లబ్ధిదారుల ఇంటికే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ఏలేశ్వరం, తిరుమాలిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ప్రతిపక్షాలు వలంటీర్ వ్యవస్థను విమర్శించడం సరికాదన్నారు. పార్టీలకు అతీతంగా పాలన అందించే సీఎం జగన్‌కు ప్రజలు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నారావు, కమిషనర్ కొండలరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, బదిరెడ్డి గోవిందు, బొదిరెడ్డి గోపి, జువ్విన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అన్నివర్గాలకు మేలు

రౌతులపూడి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరుగుతుందని ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ అన్నారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో సోమవారం ఎంపీడీఓ ఎం.గోవింద్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకూ వివిధ ధ్రువీకరణ పత్రాలను స్థానిక నేతలతో కలసి ఆమె అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.సాయి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చలగళ్ల దొరబాబు సూచించారు. గండేపల్లి సచివాలయం–2 వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మద్దిపట్ల రామకృష్ణ, సర్పంచ్ రుత్తల లలిత, జేసీఎస్ కన్వీనర్ తాళ్లూరి మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు

శంఖవరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీపీ పర్వత రాజుబాబు అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ ఈగల విజయదుర్గ అధ్యక్షతన సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 200 మంది లబ్ధిదారులకు ఎంపీపీ సర్టిఫికెట్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ఈగల మాణిక్యాలరావు, పల్లా నాగిని, పంపనబోయిన సత్తిబాబు, మామిడి సత్తిబాబు, గెద్దం పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.